క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు మందులు అందిస్తున్న సర్పంచ్ విజయ

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని వెంకటాపురం పంచాయతీ పాదలపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు సర్పంచ్ విజయ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పుత్తూరు సుభాషిణి ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో అనేక మండలాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చాలామందికి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో శ్వాసకోశ, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులకు, అలాగే చిన్నపిల్లల వైద్య నిపుణులచే పరీక్షలు చేయించడం జరిగిందన్నారు. పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న 14 మందిని గుర్తించి వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స అందిస్తామన్నారు. అనంతరం బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సర్పంచ్ చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏసమ్మ, ఏకాంబరం, గోవిందయ్య, కాళప్ప, మహేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాపీమేస్త్రి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న హేమసుందర్ రెడ్డి

వెదురుకుప్పం: మండలంలోని నక్కలాంపల్లెలో శనివారం సాయంత్రం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి సి.ధనుంజయులు(43) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి ఆదివారం గ్రామంలో పర్యటించి ధనంజయులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులను ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వపరంగా పిల్లలకు ఉపాధి కల్పనకు ప్రయత్నిస్తామని చెప్పారు. స్థానిక ఎంపీటీసీ పుష్ప, నాయకులు నాగరాజు ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో భద్రతకు సెగ్వేలు



ప్రయాణికులను పరిశీలిస్తున్న సెగ్వే పోలీస్

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలోని రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత కోసం అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రైల్వే పోలీసులకు అనుకూలంగా రెండు చక్రాలతో ఉన్న సెగ్వే యంత్రాలను సమకూర్చారు. వాటి ద్వారా రైల్వే పోలీసులు రైలు ఇంజిన్ నుంచి చివరి బోగీ వరకు ప్లాట్‌ఫాంపై సంచరిస్తూ ప్రయాణికులకు రక్షణ కల్పిస్తున్నారు.

శ్రీవారికి పరదాలు



శ్రీవారికి సమర్పించే ఉగాది ప్రత్యేక పరదాలకు తుది మెరుగులు దిద్దుతున్న పరదాలమణి

తిరుపతి కల్చరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతికి చెందిన మణి తిరుమల శ్రీవారి ఆలయానికి సమర్పించేందుకు ప్రత్యేక పరదాలు, కురాళాలు రూపొందించారు. ప్రతి ఏటా ఉగాది, సాలకట్ల బ్రహ్మోత్సవాలు, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు ఆలయ శుద్ధి అనంతరం పరదాల మణి ప్రత్యేక పరదాలు, కురాళాలు బహూకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 22వ తేదీన ఉగాది పర్వదినం సృష్టి ప్రారంభం, యుగాది, కలియుగ వైకుంఠుడైన శ్రీవేంకటేశ్వరస్వామి భూమిపై పాదం మోపిన రోజు కావడంతో స్వామివారి పాదాలకు పూర్ణకుంభంతో స్వాగతం పలకడంతోపాటు స్వామి వారి పాదాలు, శంఖు, చక్రం, తిరునామం, ఉగాది సంప్రదాయం ఉట్టిపడేలా అరటి, మామిడి తోరణం వంటి వాటితో మూడు పరదాలు, రెండు కురాళాలు రూపొందించారు. వీటిని ఆయన సోమవారం తిరుమల శ్రీవారి ఆలయంలో అధికారులకు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారికి పరదాలు అందించే సేవ దక్కడం తన పూర్వ జన్మసుకృతమన్నారు. తన జీవితాంతం శ్రీవారి సేవలో తరిస్తానని పేర్కొన్నారు.

కొంత ఖేదం.. కొంత మోదం



అకాలవర్షం వల్ల కార్వేటినగరంలో నేలరాలిన మామిడి పిందెలు



కార్వేటినగరం : కళకళలాడుతున్న చెరుకుపంట

- అకాల వర్షంతో మామిడి, వరిపంటలకు దెబ్బ
- నేలరాలిన పూత, పిందె, తడిసిన వరిధాన్యం
- చెరుకు తోటలకు బలం

కార్వేటినగరం: ఉపరితల ఆవర్తనం ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా నియోజకవర్గంలో మోస్తారు వర్షాలు పడడంతో కర్షకుల నుంచి కొంతఖేదం.. కొంతహర్షం వ్యక్తం అవుతోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజామున వరకు పడిన వర్షానికి చెరుకుతోటలో ఎరువులు వేసుకోవాడనికి అనువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అలాగే ఎక్కడా వడగళ్లు, ఈదురుగాలులు లేకపోవడంతో పెద్దగా పంట నష్టం వాటిల్లలేదని అంటున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఓ మోస్తారు గాలులు వీయడంతో మామిడి కాయలు రాలిపోవడంతో మామిడి రైతులకు కొంతమేరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలసముద్రం మండలంలో శనివారం రాత్రి మోస్తారు నుంచి భారీ వర్షాలు పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారింది. మురుగునీరు రోడ్లపై పరుగులు తీసింది. అదేవిధంగా వెదురుకుప్పం మండలంలో ఎర్రగుంటలో ఇంటిపై శనివారం రాత్రి పిడుగు పడడంతో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇంటిలోని విద్యుత్ పరికరాలు, మోటార్లు ధ్వంసమయ్యాయని గ్రామస్తులు అంటున్నారు. అదేవిధంగా శ్రీరంగరాజపురం, గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాల్లో కూడా అకాల వర్షాలకు మామిడితోటల్లో పిందెలు రాలడంతో మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో ఊరట

నగరి : నియోజకవర్గ పరిధిలో ఉదయం నుంచి రాత్రి వరకు కొంత విరామమిస్తూ కురిసిన వర్షం పట్టణ ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. వేసవి తీవ్రత అధికమైన తరుణంలో వరుణుడు కరుణించడంతో ఊరటనిచ్చింది. వేకువజామునే భారీగా వర్షం కురిసింది. ఉదయం మరోసారి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. రికార్డు స్కేల్‌పై నింద్ర మండలంలో 15.4 మిల్లీమీటర్లు, నగరి మండలంలో 9.4 మిల్లీమీటర్లు, విజయపురం మండలంలో 8.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

జీడీనెల్లూరులో...

గంగాధరనెల్లూరు: మండలంలోని పరిసర ప్రాంతాల్లో ఆదివారం తేలికపాటి వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమైంది. మూడు దఫాలుగా వర్షం కురవడంతో ఎండవేడిమికి ఇబ్బంది పడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించింది. అయితే వర్షానికి మామిడి పూత రాలి నష్టం కలిగించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గాలివాన.. అకాలవర్షం

పాలసముద్రం : మండలంలోని ఆదివారం ఉదయం గాలివానతో కూడిన వర్షం కురిసింది. గాలికి మామిడి, సపోటా తోటల్లో పూత, పిందెలు రాలిపోయాయి. అయితే కొన్ని గ్రామాల్లో రైతుల పొలాల్లోని బోర్లలో నీరు అడుగంటి అరకొరగా వచ్చేవి. ఈ సమయంలో వర్షం పడడంతో కొంతవరకు భూగర్భ జలాలు పెరిగి నీరు పుష్కలంగా వచ్చే అవకాశం కలిగిందని రైతులు చెబుతున్నారు. అలాగే పంటలకు కొంచెం ప్రాణం పోసినట్లు అయిందని ఆనందపడుతున్నారు. అయితే ఇటుక బట్టీలతో కొందరు లాభాలు ఆర్జిస్తుండడంతో ఇటీవల చాలామంది రైతులు ఇటుక బట్టీలు వేశారు. కానీ ఆకస్మికంగా కురిసిన వర్షానికి ఇటుకలు తడిసిపోయి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటిపై పిడుగు పాటు


వెదురుకుప్పం: మండలంలోని ఎర్రగుంటపల్లెకు చెందిన ప్రభాకర్‌రెడ్డి ఇంటిపై ఆదివారం వేకువజామున పిడుగు పడింది. తెల్లవారుజామున కావడంతో అంతా గాఢనిద్రలో ఉండగా పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు భయకంపితులయ్యారు. ఈ ఘటనలో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. పిడుగు పడే సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న విద్యుత్ మీటర్లు, స్విచ్‌బోర్డులతో పాటు గ్రామంలోని కొన్ని ఇళ్లల్లో టీవీలు కూడా కాలిపోయినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మండలంలో ఆదివారం మోస్తరు వర్షం పడింది.



నగరిలో కురుస్తున్న వర్షం



వర్షాలకు తడిసిపోయిన ఇటుకలు



వెదురుకుప్పం: పిడుగుపాటుకు కాలిపోయిన స్విచ్ బోర్డు

లైన్‌మన్ లేక ఇక్కట్లు

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో విద్యుత్ లైన్‌మన్ లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉన్న లైన్‌మన్ బదిలీపై వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో మరమ్మతులు చేయడానికి కూడా ఎవరూ లేరు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైన్‌మన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆర్బీకేల్లో ఎరువులు

వడమాలపేట: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, కాంప్లెక్స్, డీఏపీ, మూడు 16 ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువులు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీ తీసుకుని రావాలన్నారు. వివరాలకు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

నింద్ర: మండలకేంద్రం నింద్రలో ఆర్వేల బాలసుబ్రమణ్యంనాయుడు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి విచ్చేసిన వారికి కంటి పరీక్షలు చేసి అందులో ఆపరేషన్ 12 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి చెన్నై శ్రీ శంకర నేత్రాలయ ఆస్పత్రికి తరలించారు. మొత్తం 47 మందికి వైద్య పరీక్షలు చేసి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

మార్చురీలోనే మృతదేహం

నగరి : గుర్తు తెలియని వ్యక్తి రోగిని నగరి ఏరియా ఆస్పత్రిలో వదిలేసి వెళ్లడంతో అతను మృతిచెందిన విషయం విదితమే. ఆ వ్యక్తి కోసం పోలీసులు షోలింగర్‌కు వెళ్లి గాలిస్తున్నారు. ఇప్పటివరకు ఎవరు వదిలేసి వెళ్లారో తెలియడం లేదు. అతని వెతుక్కుంటూ ఎవరూ రాలేదు. దీంతో ఆ మృతదేహం ఇప్పటి వరకు మార్చురీ లోనే ఉంది.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



భక్తులకు అన్నదానం

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. మూలవర్లను పరిమళాలు వెదజల్లే సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. వివిధ రకాల పూలు, ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి ఊరేగింపుగా బ్యాండుమేళాల నడుమ వేంచేపు చేశారు. ఉభయదారులు చిత్తూరుకు చెందిన డాక్టర్ అమర్‌నాథ్, డాక్టర్ మాధవిని కంకణ ధారులను చేశారు. ఆలయ అర్చకుల బృందం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. హోమం నిర్వహించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనేకమంది భక్తుల నడుమ శ్రీదేవి, భూదేవి మెడలో మాంగళ్య ధారణ చేశారు. భక్తులు కానుకలు సమర్పించారు. మధ్యాహ్నం విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఉభయదారులకు ఆలయ మేనేజర్ వెంకటేశులురెడ్డి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాలను బహూకరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

తిరుమలలో వర్షం



ఆలయం వెలుపల భక్తుల రద్దీ

అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో తిరుమలలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. ఎక్కడికక్కడ షెడ్లలో తలదాచుకున్నారు. కొంతమంది భక్తులు వర్షంలోనే తడుస్తూ ముందుకు సాగారు. వ్యాపారులు దుకాణాలను సైతం మూసేశారు. - తిరుమల



నిర్మానుష్యంగా ఉన్న అఖిలాండం



వర్షంలో షెడ్ల కింద నిలుచుని ఉన్న భక్తులు



దుకాణాలపై ప్లాస్టిక్ పట్టలు కప్పిన వ్యాపారులు

నందీశ్వరుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు కొండమల్లీశ్వర స్వామికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భక్తులకు శరణాగతి నేర్పిన అన్నమయ్య



మాట్లాడుతున్న ఎస్వీయూ విశ్రాంతి ఆచార్యులు కట్టమంచి మహాలక్ష్మి

తిరుపతి కల్చరల్: భగవంతుని తత్వాన్ని తెలుసుకునేందుకు శరణాగతి తప్ప మరో మార్గం లేదని భక్తులకు అన్నమయ్య తెలియజేశారని ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు కట్టమంచి మహాలక్ష్మి తెలిపారు. అన్నమయ్య 520వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాహితీ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అన్నమయ్య సంకీర్తనలు- నైతికతత్వం అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య సంకీర్తనల్లో అహింస, సచ్చీలత, భక్తి, శరణాగతి, నామసంకీర్తనం ప్రధానంగా ఉన్నాయన్నారు. అన్ని వర్గాల వారు నైతిక విలువలతో ఎలా జీవించాలి అనే విషయాన్ని వివరించారని పేర్కొన్నారు. తుడా కార్యదర్శి లక్ష్మీ అన్నమయ్య సంకీర్తనలు- నేటి యువత అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య వాడుక భాషలోని సామెతలు, పలుకుబడులను ఉపయోగించి 32 వేల సంకీర్తనలను రచించారని, చదువురాని వారికి సైతం అర్థమయ్యేలా చేశారని పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విద్యాపీఠం ఆచార్యులు చక్రవర్తి రంగనాథన్ అన్నమయ్య సంకీర్తనలు- ఆళ్వార్లు అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య ఆళ్వార్ల దివ్యప్రబంధాలను, విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ఉపదేశించి నవవిధ భక్తి మార్గాలతో శ్రీవారిని సేవించారని తెలిపారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, పాల్గొన్నారు.

నిల్వ ఉన్న మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



మాంసం దుకాణాదారున్ని హెచ్చరిస్తున్న శానిటేషన్ సెక్రటరీ

పుత్తూరు రూరల్: దుకాణాదారులు నిల్వ ఉన్న మాంసం, చికెన్‌ను విక్రయిస్తే భారీ జరిమానాతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శానిటేషన్ సెక్రెటరీలు ఆదివారం పట్టణంలోని అంగళ్లు, హోటళ్ల వద్దకు వెళ్లి ఆయా యజమానులను నేరుగా హెచ్చరించారు. అలాగే హోటళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని మరుసటి రోజు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. మాంసం విక్రయదారులు వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని, అలాకాక ఎక్కడ పడితే అక్కడ పడేస్తే జరిమానా విధిస్తామన్నారు. సోమవారం నుంచి పట్టణంలో తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం ఏర్పాటు



సంఘ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న సభ్యులు

పుత్తూరు రూరల్: తిరుపతి జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం (డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ) ఆవిర్భావ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.నూతనకుమార్‌రెడ్డి, కార్యదర్శి జి.జోసెఫ్‌కిషోర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పుత్తూరు 3వ వార్డు అడ్మిన్ సెక్రెటరీ చాంద్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.సౌమ్య, కార్యదర్శిగా జి.గిరిబాబు, సహాయ కార్యదర్శిగా కె.విజయలక్ష్మితో పాటు 11 మందిని కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకులు శ్యామూల్ మాట్లాడుతూ జిల్లా కమిటీలు తమకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో వెలసిన శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదీ ధర్మరాజుల స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీదేవి, ధర్మరాజుల స్వామి ఉత్సవ విగ్రహాలతో పాటు భీమ, అర్జున, నకుల సహదేవ ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ గ్రామవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం అమ్మవారితో పాటు ధర్మరాజుల వారి ఉత్సవమూర్తులను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో పాటు విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు ముత్యాల తలంబ్రాలు పోసి కనుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిత, ఆలయ నిర్వాహకులు రాజశేఖర్‌నాయుడు, కుప్పయ్య, నారాయణస్వామి, గంగాధరం, పలువురు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

తిరుపతి అలిపిరి: శ్రీవారి సేవకులు ఎప్పటిలాగే బాగా పనిచేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం ఒంటిమిట్టలో శ్రీవారి సేవకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీ స్వామివారి కల్యాణోత్సవానికి సాయంత్రం 4 గంటల నుంచే భక్తులు గ్యాలరీల్లోకి వస్తారని తెలిపారు. భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, అక్షింతలు, పసుపు కుంకుమ, వాటర్ పాకెట్లు ఉంచిన బ్యాగు అందజేస్తామని చెప్పారు. వాటిని శ్రీవారి సేవకులు గ్యాలరీల్లోని భక్తులకు పంపిణీ చేయాలని సూచించారు. సేవకోసం వచ్చే వారికి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. టీటీడీలో శ్రీవారి సేవ విభాగానికి ఎంతో గౌరవం గుర్తింపు ఉన్నాయన్నారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో అద్భుత సేవలందించి ఈ పేరు నిలుపుకోవాలని కోరారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, పీఆర్వో రవి, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, వీజీవో మనోహర్ పాల్గొన్నారు.